ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
ఆదివారం 10 ఆగస్టు 2025



ఘనంగా రక్షాబంధన్ వేడుకలు






ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న సోదరి లీల, ప్రతాప రామకృష్ణకు రాఖీ కడుతున్న సోదరి రాధ, జడ్పీమాజీ వైస్‌చైర్మన్ వేణుకు రాఖీలు కడుతున్న సోదరీమణులు, ఎల్లారెడ్డిపేటలో యజ్ఞోపవిత ధారణ చేస్తున్న పద్మశాలీలు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం రాఖీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అర్బన్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్ద బోనాల, పెద్దూర్, సర్దాపూర్ గ్రామాలతోపాటు రాజీవ్‌నగర్, చంద్రంపేటలో పద్మశాలీ సంఘాలతో పాటు రాజీవ్‌నగర్ మార్కండేయ ఆలయంలో నూలు పౌర్ణమి మహాయజ్ఞాన్ని నిర్వహించడంతోపాటు యజ్ఞోపవిత యాగాలు చేసి పద్మశాలీలు జంజిరాలను ధరించారు. చంద్రంపేట, రాజీవ్ నగర్‌లలో మార్కండేయ శోభాయాత్రను ఊరేగించారు. ఈ సందర్భంగా ఎండ్లబండ్లు, ట్రాక్టర్‌లపై ఏర్పాటు చేసిన మగ్గాలపై వస్త్రాలను తయారు చేసి గ్రామాల్లోని దేవాలయాల్లోని దేవుళ్లకు కప్పడంతోపాటు విగ్రహాలకు వేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు పోచవేని సత్యఎల్లయ్య, బుర్ర లక్ష్మీ, కల్లూరి లత, పాతూరి రాజిరెడ్డి, బోల్లం నాగరాజుగౌడ్, చెన్నమనేని కీర్తి, భూక్య రెడ్డినాయక్, లింగంపల్లి సత్యనారాయణ, పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంతో పాటు మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసంలో తన సోదరి లీల రాఖీ కట్టి స్వీట్‌ని తినిపించగా బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణకు తన సోదరి రాధ రాఖీ కట్టారు. అంతే కాకుండా సోదరులకు సోదరిమణులు రాఖీలు కట్టి తమ ప్రేమను చాటుకున్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో రాఖీ పండగ వేడుకలను శనివారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. అన్నలకు చెల్లెళ్ళు, తమ్ముళ్ళకు అక్కలు రాఖీ కట్టి పండగ ప్రాధాన్యతను చాటారు. రాఖీ పండగ నేపథ్యంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాఖీ పండగను ఘనంగా జరుపుకున్నారు.

● ఇల్లంతకుంట : ప్రేమ, ఆప్యాయతల మధ్య రాఖీ పౌర్ణమి వేడుకలు శనివారం కొనసాగాయి. ఆడపడుచులు పట్టింటికి వచ్చి సోదరులకు రాఖీ కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మండలకేంద్రంలో రాఖీ దుకాణాలు, స్వీట్‌షాపులు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. గ్రామాలకు వెళ్లే ప్రయాణీకులతో బస్టాండ్ రద్దీగా కనిపించింది. పొత్తూర్ గ్రామంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణుకు సోదరీమణులు రాఖీలు కట్టారు.

● ఎల్లారెడ్డిపేట : సోదరాభావానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు ఎల్లారెడ్డిపేట మండలంలో శనివారం ఘనంగా జరిగాయి మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, వెంకటాపూర్, బండలింగంపల్లి, సింగారం, కోరుట్లపేట, తిమ్మాపూర్, అక్కపల్లి, రాజన్నపేట, అల్మాస్‌పూర్, దుమాల, పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్ తదితర గ్రామాల ప్రజలు ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో పురోహితుడు ఉమాశంకర్ ఆధ్వర్యంలో పుణ్యావచనం, అభిషేకం, గణపతి పూజ, హోమం తదితర కార్యక్రమాలను జరిపించారు. యజ్ఞోపవీతం గావించారు. సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి నాకు నీవు రక్ష..నీకు నేను రక్ష అంటూ ఆప్యాయతను పంచుకున్నారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి శోభాయాత్రను సాయంత్రం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారిని గ్రామ వీధులగుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాగా, బీఆర్ఎస్ పార్టీలో చురుకుగా పని చేస్తున్న మహిళా నాయకురాలు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఇంటికే పరిమితమైంది. ఆరోగ్యంగా ఉన్న సమయంలో ప్రతి యేటా రాఖీ పౌర్ణమి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావుకు మండల కేంద్రానికి చెందిన మహిళా నాయకురాలు శ్యామ మంజుల గతలో రాఖీ కట్టి అనుబంధాన్ని చాటేది. ఆమె అనారోగ్యంతో ఇంటికే పరిమితమైందనే విషయం తెలుసుకున్న ఆయన శనివారం మంజుల ఇంటికి వెళ్లి రాఖీ కట్టించుకుని మనోధైర్యం నింపారు.

● వీర్నపల్లి : మండలంలో రాఖీ పండగ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీలు కట్టిన అక్కాచెల్లెళ్లకు సోదరులు కానుకలను అందించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

●తంగళ్ళపల్లి : మండల కేంద్రంతో పాటు పద్మనగర్ శివలింగ భక్త మార్కండేయ దేవాలయాల్లో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నూలు పౌర్ణమి వేడుకల్లో భాగంగా పురోహితులు పుణ్యావచనం, అభిషేకం, గణపతి పూజ, హోమం, తదితర కార్యక్రమాలను శనివారం ఘనంగా జరిపించారు. యజ్ఞోపవీతం గావించారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి శోభాయాత్ర నిర్వహించి, మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నాతమ్ముళ్లకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి ఆప్యాయతను చాటుకున్నారు. కార్యక్రమంలో తంగళ్ళపల్లి పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, పద్మనగర్ అధ్యక్షుడు మోర శ్రీకాంత్, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



కోనరావుపేటలో స్వామివారి ఊరేగింపు..

● కోనరావుపేట : రాఖీ పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అన్నా చెల్లెళ్ల, అక్క తమ్ముళ్ల ఆత్మీయతను చాటి చెప్పే రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రకృతి ప్రేమికుడు దొబ్బల ప్రకాష్ కూతురు బ్లేస్సి మొక్కకు రాఖీ కట్టి ఆత్మీయతను చాటుకుంది.

● కోనరావుపేట : మండల కేంద్రంతో పాటు నిమ్మపల్లి గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామిని ఊరేగించారు. నులిపోగు జంజిరాల పండుగ సందర్భంగా స్వామివారిని ఊరేగించగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలంలో శనివారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్న తమ్ముళ్లకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టారు.

● రుద్రంగి : రుద్రంగి మండలంలో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే నూలు పౌర్ణమి, రాఖీ పౌర్ణమి, జంజ్యాల పూర్ణమి సందర్భంగా పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పద్మశాలీలు జంధ్యోపవీతం ధరించారు. అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టగా అన్నదమ్ములు కానుకలను సోదరిమణులకు అందజేశారు.

కాగా, మండల కేంద్రంలో నూలు పౌర్ణమి, రాఖీ పౌర్ణమి సందర్భంగా మార్కండేయ శోభాయాత్రను శనివారం ఘనంగా జరుపుకున్నారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఓ ట్రాక్టర్‌పై మగ్గం పేట్టి వస్త్రాన్ని నేశారు.మరో ట్రాక్టర్‌లో శంకరుడు, మార్కండేయుడు, యముడు, చిత్రగుప్తుడు, బటులు, వివిధ వేషధారణలో శోభాయాత్రను గ్రామంలోని వీధుల గుండా నిర్వహించారు. మార్కండేయ శోభాయాత్ర అనంతరం మగ్గంపై వేసిన వస్త్రాన్ని వేలం వేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బాస ని ఓంప్రకాష్, ప్రధానకార్యదర్శి మంచె రమేష్, మంచె రాజేశం, పిల్లమా రఘ ప్రవీణ్, పడాల గణేష్, మ్యాకల రమేష్, పులి రాజేష్, పడాల శంకర య్య, ఏలిగేటి నరేష్, మ్యాకల రాజేందర్, బాసని రాజు కుమార్ పాల్గొన్నారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాలులో ఈనెల 10న చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు లక్మారెడ్డిలు శనివారం వేర్వేరు ప్రకటనలో కోరారు. ముఖ్య అతిథిలుగా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌లు హాజరు కానున్నారని పేర్కొన్నారు. లబ్దిదారులు హాజరై జయప్రదం చేయాలని తహసీల్దార్ సుజాత, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు లక్మారెడ్డి కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోనరావుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిజామాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ దివ్య తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం నిజామాబాద్, మర్తనపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలైన నిజామాబాద్, కనగర్తి, మల్కపేట, ధర్మారం, మర్తనపేట, నాగారం, కొలనూరు గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

చందుర్తి ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలంలోని 11 కేవీ చందుర్తి ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌లో పని జరుగుతున్నందున చందుర్తి మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ మహేష్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. మండల కేంద్రంలో ఉదయం 10:00 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్తు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించగలరని కోరారు.

ఇంటిని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన జల్లి పోచవ్వ ఇంటిని స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం పరిశీలించారు. బాధితురాలు పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా చూస్తామని భరోసా కల్పించారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పద్మారెడ్డి, కిష్టారెడ్డి, శ్రీనివాస్, సత్తయ్య, బాల పోచయ్య, దేవయ్య తదితరులు ఉన్నారు.

రాఖీ కట్టించుకునేందుకు తిప్పలు

- గురుకలం వద్దకు వచ్చిన సోదరులు
- తక్కువ సమయం అనుమతించిన ఉపాధ్యాయులు
- ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

వేములవాడ టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంతోపాటు మండల పరిధిలోని పలు గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు సెలవులు ఇవ్వకపోవడంతో రక్షాబంధన్ రోజున విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని ఓ గురుకుల పాఠశాల చదువుతున్న తమ కూతుళ్లకు సెలవు ఇవ్వకపోవడంతో తమ కుమారులను వెంట బెట్టుకుని గురుకుల పాఠశాలకు తల్లిదండ్రులు వచ్చారు. దీంతో విద్యార్థినులను బయటకు పంపియకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన ఉపాధ్యాయులు కొద్ది సమయం మాత్రమే అనుమతించడంతో విద్యార్థినులను గురుకుల పాఠశాల ఆవరణలోని చెట్ల కింద రక్షాంబంధన్ వేడుకలు జరుపుకున్నారు. దీంతో తమ సోదరులకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. రాఖీ పండగ రోజున విద్యార్థినులను బయటకు పంపియకపోవడంతో ఉపాధ్యాయుల తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



గురుకుల పాఠశాల ఎదుట వేచిఉన్న విద్యార్థినుల తల్లిదండ్రులు

బాల్యాన్ని నులిపేస్తుంది..



- శక్తిని మింగేసే నులి పురుగు
- 60 శాతం రక్తహీనతకు కారణం
- వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడమే సమస్య
- జిల్లావ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1.18 లక్షల మంది లక్ష్యం
- రేపు నులిపురుగుల నివారణ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పిల్లలు బడికి వెళ్లడానికి రెడీ అయినా క్షణంలోనే కడుపు నొప్పి అంటూ విల్లవిల్లాడుతారు. కొందరు బడి తప్పించుకోవడానికి అనుకుంటారు.. మరి కొందరు అకస్మాత్తుగా వచ్చిన నొప్పిని చూసి గాభరా పడుతారు. ఇది నులిపురుగుల నొప్పి కూడా అవుతుంది. పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండే తల్లిదండ్రులను ఇబ్బందికి గురిచేసే నులిపురుగులు తయారుకావడం ప్రధానంగా శుభ్రత పాటించకపోవడమే. నులి పురుగులతో ఒక్కొక్కసారి ప్రాణాంతకమైన సమస్యలు కూడా వస్తాయి. రక్తహీనతకు 60 శాతం నులిపురుగులే సమస్యగా ఉంటాయి.

ముఖ్యంగా సంవత్సరం పిల్లవాడి నుంచి 19 సంవత్సరాల యువకుడి వరకు పొట్టలో పెరిగే పురుగులతో బాధపడుతూనే ఉంటారు. నులి పురుగులు, కొంకి పురుగులు, కొరడా పురుగులు, బద్దె పురుగులు, ఏలిక పాములు, దారపు పురుగులు.. ఇలా పొట్టలో చేరి అనేక రోగాలకు కారణమవుతుంటాయి. వీటి నివారణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రతి ఏడాది రెండుసార్లు జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. సోమవారం ఆగస్టు 11న మాత్రలు వేస్తారు. ఆరోజు మాత్రలు వేసుకొని వారికి 18న మాప్‌అప్ డేగా తప్పని సరిగా నులి పురుగుల మాత్రల పంపిణీకి చేయనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో లక్షా 18వేల 736 మందికి నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేసే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించే విధంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు.

నులి పురుగులతో పిల్లల్లో రక్తహీనత

పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే తల్లిదండ్రులకు సంతోషం. ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తతతో ఉండాలి. పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, శారీరక, మానసిక అభివృద్ధిపై ప్రభుత్వం కూడా చర్యలు చేపడుతోంది. ఆరోగ్య సమాజం కోసం ఎన్ని చర్యలు చేపట్టినా ఇంకా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా సంవత్సరం పిల్లవాడి నుంచి 19 సంవత్సరాల యువకుడి వరకు పొట్టలో పెరిగే పురుగులతో బాధపడుతూనే ఉంటారు. నులి పురు గులు, కొంకి పురుగులు, కొరడా పురుగులు, బద్దె పరు గులు, ఏలిక పాములు, దారపు పురుగులు ఇలా మన పొట్టలో చేరి అనేక రోగాలకు కారణమవుతుంటాయి. వీటి నివారణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రతి ఏడాది జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1,18,736 మందికి మాత్రల లక్ష్యాన్ని పెట్టుకోగా, ఏడాది నుంచి 19 సంవత్సరాల వయసుల వారీగా లక్ష్యాలను గుర్తించారు. జిల్లాలో 47 జూనియర్ కాలేజీలు, 626 పాఠశాలలు, 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఐసీడీఎస్ పరిధిలో 30,475 మంది పిల్లలు ఉండగా, పాఠశాలల్లో 77,921 మంది పిల్లలు, జూనియర్ కాలేజీల్లో 7,664 మంది ఉన్నట్లు గుర్తించారు. ఇందుకోసం 168 మంది ఆరోగ్య శాఖ సిబ్బంది, 456 మంది ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, కళాశాలల ప్రతినిధులు పాల్గొంటున్నారు.

వయస్సును బట్టి మాత్ర..

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పంపిణీ చేసే అల్బెండజోల్

మిగతా 8వ పేజీలో



ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ప్యానెల్స్

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వ కార్యాలయాలపై యుద్ధ ప్రాతిపదికన సోలార్ విద్యుత్ ప్యానెల్స్‌లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్కమార్క కలెక్టర్‌ను ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత కలెక్టరేట్‌లో శనివారం జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోలార్ విద్యుత్‌ప్యానెల్స్ ఏర్పాటుపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో మాట్లాడారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగం, ఉత్పత్తిని పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలపై పూర్తి స్థాయిలో సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయంతోపాటు అన్ని ప్రభుత్వం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటుకు వారం రోజుల్లో ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. సోలార్ విద్యుత్ వినియోగంతో కరెంట్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, విద్యాసంస్థల వివరాలు అందుబాటులో ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలాల వివరాలను వారం రోజులల్లో పంపించాలన్నారు. ఆర్వోఓఎఫ్ ఆర్ చట్టం ప్రకారం గిరిజనులకు సోలార్ విద్యుత్ ప్యానెల్స్‌లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయిందని వివరించారు. ఆర్వోఓఎఫ్ ఆర్ భూములలో సోలార్ పంపుసెట్ల్ ఏర్పాటు ప్రక్రియ మూడు సంవత్సరాలల్లో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్న సోలార్ విద్యుత్ ప్యానెల్స్‌ల ఏర్పాటుపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే..



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వీర్నపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం భూక్యతండా పరిధి రాశిగుట్ట తండా, మద్దిమల్ల గ్రామాల్లో ఫీవర్ సర్వే వారం రోజుల నుంచి కొనసాగుతోంది. వైద్యసిబ్బంది ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటా తిరుగుతూ జ్వరం ఉన్నవారి నుంచి రక్తనమూనాలను సేకరిస్తున్నారు. రెండు గ్రామాల్లో శనివారం 64మందికి ఓపీ చూసినట్లు ఎంఎల్‌హెచ్‌పీ బాలకృష్ణ, ఆకాష్ తెలిపారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి, నిల్వ ఉన్న నీటిని తొలగించారు. దోమల నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, ఇందిర, ఏఎన్ఎంలు కీర్తి, సుజాత, అమృతవల్లి, మంజుల, ప్రవీణకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రుద్రంగిలో యూరియా కొరత లేదు..

- మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కొందరు రైతుల ముసుగులో కావాలని రాజకీయాలు చేస్తున్నారని, రుద్రంగిలో యూరియా కొరతలేదని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సామ మోహన్‌రెడ్డి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కావాలని కొందరు వ్యక్తులు ప్రభుత్వాన్ని బదనం చేయడానికి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. జిల్లాలో యూరియా కొరత ఉండకూడదని, రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండకుండా ఇటీవల కలెక్టర్‌తో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడటంతో జిల్లా కేంద్రంలోని అపేరల్ పార్కులో యూరియాను స్టోరేజీ చేశారన్నారు. అసత్యపు ప్రచారాలను నమ్మి రైతులు ఆగం కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, ఇప్ప మహేష్, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, పుట్కపు మహిపాల్‌రెడ్డి, దయ్యాల శ్రీనివాస్, గండి ఆశోక్, పల్లికొండ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా మార్కండేయ స్వామి శోభాయాత్ర 8

పండగ పూట విషాదం..

● జగిత్యాల జిల్లాలో అనారోగ్యంతో ఇద్దరు యువకుల మృతి



అనిల్(ఫైల్)

గొల్లపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో శనివారం రాఖీ పండగపూట విషాదం నెలకొంది. గొల్లపల్లి మండలం రాఘవ పట్నం గ్రామానికి చెందిన గరిగంటి అనిల్(24), తిర్మలాపూర్(పీడీ) గ్రామానికి చెందిన అన్వేష్(22) అనే యువకులు అనారోగ్యంతో మృతిచెందారు. రాఘవపట్నం గ్రామానికి చెందిన గరిగంటి అనిల్ హైదరాబాద్‌లో పీజీ చదువుతూ రాఖీ పండగ కోసం స్వగ్రామం వచ్చాడు. శనివారం ఉదయం తన అక్కా-చెల్లెళ్లతో రాఖీలు కట్టించుకున్న అనిల్ మధ్యాహ్నం ఇంట్లో నిద్రపోయాడు. సాయం త్రం అయినప్పటికీ లేవకపోవడంతో కుటుంబ సభ్యులు నిద్ర లేపేందుకు యత్నించారు. అయితే అతడిలో ఎలాంటి చలనం లేకుండా ఉండడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన జగిత్యాలలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అనిల్ గుండెపోటుతో అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తిర్మలాపూర్‌కు చెందిన అన్వేష్ అనే యువకుడు చిన్నతనం నుంచి తలసేమియాతో బాధపడుతూ శనివారం మృతిచెందడంతో బాధిత కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది.

ఒంటరితనం భరించలేక .. ఉరి వేసుకుని ఆత్మహత్య

గంగాధర, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మధురానగర్‌లో ఒంటరితనం భరించలేక ఉరివేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలం నమిలికొండకు చెందిన అల్లకుంట గంగారాం(70) గంగాధర మండలం మధురానగర్‌లోని పెద్దకుమారుడు శ్రీనివాస్‌తో ఉంటున్నాడు. ఐదు సంవత్సరాల నుంచి గంగారాం భార్య, కూతురు, కొడుకు వరుసగా మృతిచెందారు. దీంతో బాధను తట్టుకోలేక మద్యానికి బానిసయ్యాడు. ఒంటరితనం భరించలేక బాధతో రెండు రోజులు క్రితం ఇంట్లో నుంచి వెళ్లాడు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెదికినా ఆచూకీ దొరకలేదు. శనివారం ఇంటి షటర్లు తెరిచే సరికి ఉరివేసుకుని మృతి చెంది కనిపించాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ ప్రమాదాల నియంత్రణే లక్ష్యం



● పకడ్బందీ కార్యాచరణ రూపొందించిన ట్రాన్స్‌కో అధికారులు
● పొలం బాటతో రైతుల సమస్యలు పరిష్కారం

మెట్‌పల్లిటౌన్/రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా ట్రాన్స్‌కో అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ప్రతి సెక్షన్‌లో కనీసం రోజుకు రెండు చొప్పున ప్రమాదాలకు అవకాశం ఉన్న స్థలాలను గుర్తించి వాటిని సరిదిద్ది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి క్షేత్రస్థాయి ఇంజనీర్లకు, సిబ్బందికి లక్ష్యాన్ని నిర్దేశించారు. దీనికి అనుగుణంగా మెట్‌పల్లి డివిజన్ పరిధిలో ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ అవగాహన కార్యక్రమాలతో పాటు పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టారు. మెట్‌పల్లి డివిజన్ పరిధిలో 1,61,340 సర్వీసులు ఉండగా అందులో వ్యవసాయ కనెక్షన్లు 59,844 ఉన్నాయి.

● కదిలిన విద్యుత్ యంత్రాంగం

కొద్ది రోజుల నుంచి డివిజన్ వ్యాప్తంగా ప్రతి సెక్షన్‌లో క్షేత్ర స్థాయి సిబ్బంది తాము గుర్తించిన సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటిని సరిదిద్దే పనికి ఉపక్రమించారు. చిన్న పనులను స్థానిక సిబ్బంది నిర్వహిస్తూ, పెద్దవాటిని కాంట్రాక్టర్ల ద్వారా చేయిస్తూ రోజువారీగా ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు అప్లోడ్ చేస్తున్నారు. దీంతో ప్రతి రోజు ఏ సెక్షన్‌లో ఏ పని జరుగుతున్నదో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడ్ సమస్యలు, సామర్థ్యం పెంపుదల, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, కొత్త కనెక్షన్ల మంజూరు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు, వంగిపోయిన స్తంభాలు, వదులుగా వేలాడుతున్న తీగలు తదితర అంశాలపై దృష్టి సారించారు.



ఆరపేట వద్ద పొలంలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఇది నిరంతర ప్రక్రియ

-జి.మధుసూదన్, డీఈ, మెట్‌పల్లి



ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తాం. స్వీయ రక్షణ జాగ్రత్తలు తీసుకోకుండా పని చేసే సిబ్బందిని గుర్తించి వారి జీతంలో కోత విధిస్తున్నాం.

నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు

-దురిశెట్టి మనోహర్, ఏడీఈ, మెట్‌పల్లి



ప్రతీ గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యలపై క్షేత్ర స్థాయి సిబ్బంది దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటున్నాం. రాబోయే కాలంలో విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తగ్గించాలనేదే మా లక్ష్యం. అందుకు సిబ్బంది సమర్థవంతంగా సేవలు అందిస్తున్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

● ప్రతీ వారం పొలం బాట..

క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకోవడానికి నేరుగా రైతుల వద్దకే వెళ్లి మాట్లాడి తక్షణం పరిష్కరించడానికి ప్రతీ వారం ఒక రోజు పొలం బాట కార్యక్రమాన్ని రూపొందించినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ల ఓవర్‌లోడ్ సమస్యలు, సామర్థ్యం పెంపుదల తదితర అంశాలపై రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పొలం బాటలో ఆయా సమస్యలను పరిష్కరిస్తున్నారు. విద్యుత్ సిబ్బందికి సమాచారం లేకుండా రైతులు స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజ్‌లు మార్చకుండా ట్రాన్స్‌కో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బైక్‌లు

● ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన చల్లూరి అనిల్ బ్యాండు కొట్టడానికి వెళ్లి తిరిగి లింగాపూర్‌కు వెళ్తున్నాడు. ఈక్రమంలో మెట్‌పల్లి గ్రామానికి చెందిన బాకారపు అజయ్ మెట్‌పల్లి నుంచి చింతలపల్లికు వెళ్తుండగా, లింగాపూర్-చింతలపల్లి గ్రామాల మధ్యలోని మూలమలుపు వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొట్టాయి. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామశివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం ఆర్టీసీబస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో జయశంకర్‌భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చెన్నాపూర్ గ్రామానికి చెందిన దేవేందర్, రాజు, మహేశ్, మణికాంత్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దేవేందర్, రాజు, మహేశ్, మణికాంత్ కలిసి కారులో సిరిసిల్ల నుంచి రాచర్లబొప్పాపూర్ మీదుగా గంభీరావుపేటకు వెళుతున్నారు. కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న సిరిసిల్ల ఆర్టీసీ డిపో బస్సు ఎదురుగా ఢీకొట్టింది. కారు పూర్తి దెబ్బతింది. కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

గోవులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గోవులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై శనివారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యైటింక్లయిన్ కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియం సమీపంలో వాటర్ ట్యాంక్ వద్ద సేదతీరుతున్న ఆవులను అల్లూరుకు చెందిన గంట యాకయ్య, గంట సారయ్య, ఆవుల కొంరయ్యలు మరికొందరితో కలసి తాళ్లతో ఆవులను బంధించి బలవంతంగా ఆటో ట్రాలీలోకి ఎక్కిస్తుండగా అటుగా పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీసులకు పట్టుబడ్డారు. ఏఎస్సై కృష్ణ ముగ్గురిని అదుపులోకి తీసుకుని ట్రాలీతో పాటు స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిని విచారించిన అనంతరం వారిపై కేసు నమోదు చేసినట్టు సీఐ ప్రసాదరావు తెలిపారు. పశువులను దండించడం, అక్రమంగా తరలించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విత్తన వ్యాపారి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మంకమ్మతోటలోని కొత్తలేబర్ అడ్డా వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడు ప్రమాదంలో సీడ్‌వ్యాపారి చాడకిషన్‌రెడ్డి (57) మృతిచెందాడు. అతడిభార్యకు గాయాలయ్యాయి. కరీంనగర్ రెండోఠాణా సీఐ సృజన్‌రెడ్డి వివరాల ప్రకారం... పెగడపల్లి మండలం నామాపూర్‌కు చెందిన చాడ కిషన్‌రెడ్డి సీడ్‌వ్యాపారం చేస్తూ కరీంనగర్‌లోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి తన భార్య రమాదేవితోకలిసి బైక్‌పై మంకమ్మతోట నుంచి జ్యోతినగర్ వెళ్తున్నాడు. వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో కిషన్‌రెడ్డి, అతడి భార్యకు గాయాలయ్యాయి. ఇద్దరినిప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కిషన్‌రెడ్డి మృతి చెందాడు. మృతుడి సమీప బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కిషన్‌రెడ్డి ఇద్దరు కూతుళ్లు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు.

పోలీస్ పహారా మధ్య యూరియా పంపిణీ

● యూరియా వచ్చిందనే సమాచారంతో ఉదయాన్నే చెప్పులు లైన్లో పెట్టిన రైతులు



వెన్కేపల్లి ఎల్‌ఎస్‌సీఎస్ వద్ద రైతులను ఒకరి తర్వాత ఒకరిని యూరియా కోసం పంపిస్తున్న పోలీసులు

సైదాపూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి విశాల సహకార సంఘంలో శనివారం వ్యవసాయాధికారుల పర్య వేక్షణ, పోలీసుల పహారాలో సొసైటీ సిబ్బంది రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియా వచ్చిందనే సమాచారంతో రైతులు ఉదయమే పెద్దఎత్తున సొసైటీ గోదాముకు వచ్చి చెప్పులు లైన్లో పెట్టారు. విషయం తెలుసుకున్న వ్యవసా యాధికారులు గోదాము వద్దకు వెళ్లి యూరియా సరిపడా ఉందని ఎవరూ ఆందోళన చెందవద్దని రైతులకు సర్దిచెప్పి లైన్లో నిలబెట్టారు. సొసైటీ సిబ్బంది, వ్యవసాయాధి కారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీ సులు గోదాము వద్దకు చేరుకొని రైతులను ఒకరి తరువాత ఒకరు యూరియా తీసుకునేలా చూశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరారు.

● బీఆర్ఎస్ నాయకుల ఆందోళన..

యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారనే సమాచారంతో బీఆర్ఎస్‌పార్టీ నాయకులు వెన్కేపల్లి సొసైటీ గోదాముకు చేరుకొని కొంతసేపు ఆందోళన చేపట్టారు. రైతులకు సరిపడా యూరియా అందించకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా పంపిణీచేయాలని డిమాండ్‌చేశారు. రైతులకు సరిపడా యూరియా అందించడంతో కాంగ్రెస్‌ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య అన్నారు. పండగపూట ప్రశాంతత లేకుండా యూరియా కోసం లైన్లో నిలబడే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం వెంటనే చొరవతీసుకొని రైతులకు సరిపడా యూరియా అందించాలన్నారు.

కొత్త కవుల వేదిక కరీంనగర్

● 148వ ఎన్నీల ముచ్చట్లలో డాక్టర్ రఘురామన్



మాట్లాడుతున్న డాక్టర్ రఘురామన్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొత్త కవులకు వేదికగా కరీంనగర్ నిలుస్తోందని, కవిత్వ రచనకు శిక్షణ ఇచ్చే కార్యశాల ఎన్నీల ముచ్చట్లని సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్ అన్నారు. శనివారం పౌర్ణమి సందర్భంగా ఐఎంఏ హాల్‌లో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 148వ ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమంలో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల సాహిత్యాభిమానులు ఉత్తమకవిత్వం కోసం కరీంనగర్‌వైపు చూస్తున్నారన్నారు. అనంతరం ఇటీవల దాశరథిపురస్కారాన్ని అందుకున్న అన్నవరం దేవేందర్‌ను డాక్టర్ రఘురామన్, డాక్టర్ సీహెచ్ విజయ్‌కుమార్ సన్మానించారు. అనంతరం రచయితలు తమ రచనలను వినిపించారు. తెరవే అధ్యక్షకార్యదర్శులు సీవీకుమార్, దామరకుంట శంకరయ్య సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పీఎస్ రవీంద్ర, నడిమెట్ల రామయ్య, కూకట్ల తిరుపతి, విలాసాగరం రవీందర్, వెల్మల కృష్ణారావు,చైతన్యవిజయశ్రీ, జలంధర్‌రెడ్డి, యుగంధర్, ఖాలిద్, మురళి, సమ్మయ్య, రమణయ్య, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం శనివారం పురస్కరించుకొని కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు అంజన్నసన్నిధికి వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు ఇతరత్రా పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టులో ఆలయం ముందు భక్తులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్‌వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనిమహిళ మృతిచెందింది. గ్రామంవద్ద శుక్రవారంరాత్రి రోడ్డుదాటుతున్న యాసర్ల అంజమ్మ(50) గుర్తుతెలియని వాహనం ఢీకొందని, తీవ్రగాయాలతో ఆమె మృతి చెందిందని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసినట్లు, ప్రమాదానికి కారణమైన వాహనం కోసం వెతుకుతు న్నట్లు పేర్కొన్నారు.

మహిళ ఆచూకీ లభ్యం

● కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కోనరావుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ ఆచూకీ లభ్యం కావడంతో కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కుటుంబసభ్యులకు శనివారం అప్పగించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన పులి లక్ష్మి ఈనెల 7న ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కొడుకు ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామన్నారు. కాగా, శనివారం కనగర్తి, మల్కపేట గ్రామాల రోడ్డు పక్కన చెట్ల పొదల్లో మహిళ మతిస్థిమితం లేకుండా పడిపోయి ఉండగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

భూ సమస్య పరిష్కరించాలని టవరెక్కిన రైతు



టవర్‌పై రైతు ప్రకాశ్‌రెడ్డి

ధర్మారం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తన పాలుకు వచ్చిన భూమిని తన అన్న అక్రమంగా పట్టా చేసుకున్నాడని, తన భూమిని తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ ఓ రైతు టవర్‌ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. ధర్మారం మండలంలోని నల్లలిం గయ్యపల్లి గ్రామానికి చెందిన యాళ్ల ప్రకాశ్‌రెడ్డికి సంబంధించిన 29 గుంటల భూమి తనఅన్న యాళ్ల నర్సింహారెడ్డి అక్రమంగా పట్టా చేసుకుని దున్నుకుంటున్నాడని ఏళ్ల గడుస్తున్నా తన సమస్యకు పరిష్కారం కావడం లేదని ప్రకాశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. శనివారం తన భూమిని నర్సింహారెడ్డి ట్రాక్టర్‌తో దున్నుతుండగా అడ్డుకోగా తన అన్నతోపాటు అతని కుమారుడు జగదీశ్వర్‌రెడ్డి తనపై దాడికి యత్నించారని తెలిపారు. 13సంవత్సరాలుగా పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగినా సమస్యపరిష్కారం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది పురుగులమందు డబ్బాతో టవర్ ఎక్కినట్లు తెలిపాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రకాశ్‌రెడ్డితో ఫోన్ మాట్లాడి నచ్చజెప్పారు. సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ప్రకాశ్‌రెడ్డి టవర్ దిగాడు. ఏళ్లుగా సమస్య పరిష్కారం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది టవర్ ఎక్కినట్లు ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లిన కారు

శంకరపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి కల్వర్టులోకి దూసుకెళ్లగా పెను ప్రమాదం తప్పింది. ఓ వ్యక్తి తన కారులో శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాడికల్ గ్రామ శివారులో కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న కల్వర్టులో పడిపోయి పొలంలోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు కారులోని వ్యక్తిని బయటకు తీశారు. ఆయన క్షేమంగానే ఉన్నట్లు సమాచారం. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపాడా లేక ప్రమాదవశాత్తు అదుపుతప్పి పడిపోయిందనే విషయం తెలియాల్సి ఉంది.

పిడుగు పడి గొర్రెలు మృతి

మంథనిరూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాన్‌సాయిపేట గ్రామశివారులోని అటవీప్రాంతంలో శనివారం పిడుగుపడి ఒక మేక, 15 గొర్రెలు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం నుంచి ఎల్లయ్యే అనే గొర్రెల కాపరి మేత కోసం తన మేకల, గొర్రెల మందతో వెళ్లగా ఒక్కసారిగా కురిసిన వర్షానికి తోడు పిడుగుపడి మేక, గొర్రెలు మృతిచెందినట్లు తెలిపారు. తనకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు ఎల్లయ్య కోరారు.

వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ ప్రారంభం



గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు

కొడిమ్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని భక్తులు ప్రారంభించారు. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో గోపూజ నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు ఆలయ పూజారి నాగరాజు రమేష్ నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మండల కేంద్రంలోని, పూడూర్ సాయిబాబా ఆలయాల్లో గ్రామస్తులకు భక్తులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేశం, సభ్యులు, దాతలు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై హింసను అరికట్టాలి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్థూపం వద్ద శనివారం పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ప్రజాసంఘాలు నిరసన చేపట్టాయి. అంతర్జాతీయ ఆది వాసీల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. సామ్రాజ్యవాదులకు, బహుళ జాతి కంపెనీలకు అపార ఖనిజ సంపదను దోచిపెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడవి బిడ్డలను హింసిస్తోందని విమర్శించారు. బస్తర్‌లో 250 పోలీస్ క్యాంపులను ఏర్పాటు చేసి 8 లక్షల పారామిలటరీ పోలీసులతో బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా ఆదివాసీలను కనుమరుగయ్యేలా చేస్తున్నా రని ఆవేదన చెందారు. 2005లో సల్వాజుడుం, 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్, 2015లో ఆపరేషన్ సమాధాన్, 24లో ఆపరేషన్ కార్ పేరుతో ఆరు నెలల పసిపాప మండ్లి సోడి నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు నిర్ధాక్షిణ్యంగా చంపివేస్తున్నారని అన్నారు. 13 నెలల్లోనే 600 ఆదివాసీ ప్రజలను ప్రభుత్వం చంపి వేసిందన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంకూరి లక్ష్మణ్, బొడ్డుపల్లి రవి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, పౌరహక్కుల ప్రజా సంఘాల నాయకులు వినోద్, ఎరుకల రాజన్న, కట్ట విశ్వనాథ్, రత్నకుమార్, రామిల్ల బాపు, గాండ్ల మల్లేష్, యాదవనేని పర్వ తాలు, బండారి రాజలింగయ్య, నక్క సత్యనారాయణ, బండి శంకర్ గౌడ్, బియ్యాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీలో రుక్మాపూర్ యువకుడి ప్రతిభ

● ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు ఎంపిక


భానుప్రసాద్

చొప్పదండి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించిన ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్-24 (ఈఎస్ఈ)కు చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని భానుప్రసాద్ ఎంపికయ్యాడు. గతేడాది యూపీఎస్సీ2024లో నిర్వహించిన ఈఎస్ఈ(ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్) మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచి ఎలక్ట్రానిక్స్ టెలికాం ఇంజనీరింగ్ విభాగంలో భానుప్రసాద్ ఎంపిక అయ్యాడు. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జాం ఫలితాలను యూపీఎస్సీ మేలో విడుదల చేయగా రెండో జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ఈ జాబితాలో భానుప్రసాద్‌కు చోటుదక్కింది. జాతీయ స్థాయిలో ప్రవేశపరీక్ష నిర్వహించగా 40వ ర్యాంక్ సాధించిన భానుప్రసాద్ మూడో ప్రయత్నంలో ఎంపిక య్యాడు. ఇంటర్ వరకు కరీంనగర్‌లో చదివి, హైదరాబాద్ సీబీఐటీలో బీటెక్ పూర్తిచేసిన భానుప్రసాద్ ప్రైవేట్‌కంపెనీలో కొంతకాలం ఉద్యోగం చేశాడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోగా తల్లి వ్యవసాయం చేసుకుంటూ కొడుకును చదివించింది. భానుప్రసాద్ ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండ్‌లో రద్దీని పరిశీలించిన ఆర్ఎం


సిబ్బందికి ఆహారప్యాకెట్లు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

భగత్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్‌స్టేషన్‌లో రాఖీ పౌర్ణమి రద్దీని కరీంనగర్ రీజినల్ మేనేజర్ బీరాజు, డిప్యూటీరీజినల్ మేనేజర్ ఎస్. భూపతిరెడ్డి పరిశీలించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా విధినిర్వహణలో ఉన్నసిబ్బందికి ఆహారప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌లు విజయమాధురి, ఎం శ్రీనివాస్, పి విజయలక్ష్మి పాల్గొన్నారు.



పండుటాకుల బతుకుల్లో వెలుగు రేఖ..

● తల్లడిల్లే వృద్ధులకు ఆసరాగా నిలుస్తున్న శ్రీరామసాయి వృద్ధాశ్రమం
● ఆశ్రమంలో 21మంది వృద్ధులు

ఇల్లందకుంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీరామసాయి వృద్ధాశ్రమం పండుటాకుల బతుకుల్లో వెలుగు నింపుతోంది. 21మంది వృద్ధులు ఆశ్రమంలో ఉంటున్నారు. మలిసంధ్యలో కొడుకులు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లతో ముచ్చట్లు పెడుతూ కాలక్షేపం చేయాల్సిన వృద్ధులు ఆదరణకు దూరమవడంతో వారిని అక్కున చేర్చుకొని ఈ ట్రస్టు పలువురికి నీడనిస్తుంది.

● విశాలమైన గదులు..

దాతల సహాయ సహకారాలతో కోట్లాది రూపాయలతో సుమారు 25గదులను అన్ని వసతులతో నిర్మించారు. ఈ ఆశ్రమాన్ని 2017అక్టోబరు 14న అప్పటి మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించగా ప్రస్తుతం 21మంది వృద్ధులు ఆశ్రమం పొందుతున్నారు.

మంచి భోజనం పెడుతున్నారు



- మల్లారెడ్డి, వృద్ధుడు, కుందనపల్లి

శ్రీరామసాయి మానవ సేవాచారిట్రబుల్ ట్రస్టు ఈ ఆశ్రమం ప్రారంభించినప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాను. ఇక్కడ సమయానికి అనుగుణంగా భోజనం పెడుతున్నారు. విశాలమైన గదులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో హాయిగా ఉంది.

మంచిగానే చూసుకుంటున్నారు.



- ఐలమ్మ, వృద్ధురాలు, రాచపల్లి

మూడు సంవత్సరాలుగా ఆశ్రమంలో ఉంటున్నాను. ఇక్కడ మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. మంచిగానే చూసుకుంటున్నారు. కన్నవారిని సైతం మరిచిపోయేలా ఇక్కడ ఉన్నటువంటి వారితో కలిసిమెలిసి కాలక్షేపం చేసుకుంటూ జీవిస్తున్నాం.

● ఆహ్లాదకరమైన వాతావరణం...

రెండెకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఆశ్రమంలో పూలమొక్కలు, నీడనిచ్చే రకరకాల చెట్లు ఉండడం వల్ల ప్రశాంతమైన వాతావరణంలో ఆనందంగా ఉంటున్నారు. అంతేకాకుండా ఆశ్రమంలో దేవాలయం, చక్కటి గార్డెనింగ్, కూర్చోడానికి బెంచీలు, వృద్ధులకు ఆసరాగా ఉపయోగపడుతున్నాయి.

● మెనూ ప్రకారం భోజనం...

ఉదయం 7గంటలకు టీ, 9గంటలకు అల్పాహారం, 10:30గంటలకు అధ్యాత్మిక కార్యక్రమాలు, మధ్యాహ్నం 1:30గంటలకు భోజనం, 3గంటలకు విశ్రాంతి, సాయంత్రం 4:30గంటలకు బిస్కెట్స్, టీ, 6గంటలకు విశ్రాంతి, రాత్రి 7గంటలకు భజన, 7:30గంటలకు విశ్రాంతి, 8:30గంటలకు భోజనం అనంతరం నిద్రకు ఉపక్రమణ.


ఇల్లందకుంటలోని శ్రీరామసాయి వృద్ధాశ్రమం

దాతలు ముందుకు రావాలి



- బచ్చు శివకుమార్, ట్రస్టు కార్యదర్శి, ఇల్లందకుంట

ఈ ఆశ్రమాన్ని దాతల ఆర్థిక సహాయ సహకారాలతో నడిపిస్తున్నాం. దాతలు ఎవరైనా ఉంటే మలిదశలో ఉన్నటువంటి వృద్ధులకు అండగా విరివిగా విరాళాలు అందజేసి ఆశ్రమ అభివృద్ధికి కృషి చేయాలి.

తొమ్మిదేళ్లుగా ఆశ్రమాభివృద్ధికి కృషి..



- ఆదిరెడ్డి, ట్రస్టు మేనేజర్, ఇల్లందకుంట

వృద్ధాశ్రమం స్థాపించినప్పటి నుంచి మా వంతుగా, దాతల సహకారాలతో ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఇందులో ఉండే వృద్ధులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉంటున్నారు. ట్రస్టు డెవలప్‌మెంట్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

దోస్త్ స్పాట్ అడ్మిషన్లలో ప్రభుత్వ డిగ్రీకళాశాలలకు అవకాశం ఇవ్వాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వివిధకారణాల చేత ఇప్పటివరకు రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్లు పొందని విద్యార్థులకు కల్పిస్తున్న దోస్త్ స్పాట్ అడ్మిషన్ల సౌకర్యం అన్ని ప్రభుత్వ డిగ్రీకళాశాలలకు వర్తింపజేయాలని తెలంగాణ ప్రభుత్వకళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి శనివారం ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల13,14వ తేదీల్లో స్పాట్‌అడ్మిషన్లు చేపట్టనున్నట్లు దోస్త్ కన్వీనర్ షెడ్యూల్ ప్రకటించారని తెలిపారు. వాటిలో కేవలంప్రైవేట్ కళాశాలలకు మాత్రమే అవకాశం కల్పించారని, ఇది పూర్తిగా అర్థరహితమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ డిగ్రీకళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకసంఘం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా అధ్యాపకమిత్రులు వాల్‌పోస్టర్ల ద్వారా, కరపత్రాలద్వారా ప్రచారంచేస్తూ విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీకళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలియజేస్తూ, ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు.

కొండెక్కిన కొబ్బరి కాయ

● రూ. 35 నుంచి రూ.40 పలుకుతున్న ధర
● రెండు నెలల్లో రూ.20 పెంపు
● శ్రావణమాసంలో భక్తులకు ఇబ్బందులు

హుజూరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొండా మంటే కొబ్బరికాయల ధరలు కొండెక్కాయి. రెండు నెలలుగా కొబ్బరికాయ ధరలు పెరుగుతూ వస్తుండడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి వరకు బహిరంగ మార్కెట్లో రూ.20కి దొరికిన కొబ్బరికాయ, ప్రస్తుతం పట్టణాల్లో రూ.35, గ్రామీణ ప్రాంతాల్లో రూ.40కి విక్రయిస్తున్నారు. వ్యాపారులు సిండికెట్ కావడమే కారణమని పలువురు అంటున్నారు. ఈ కొబ్బరికాయలు ఆంధ్రా, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. కానీ ప్రస్తుతం మార్కెట్‌కు తగ్గట్టుగా కొబ్బ రికాయలు దిగుమతి కావడంలేదు. వచ్చిన కొబ్బరికాయలు కూడా చిన్నవిగా ఉంటున్నాయి. దిగుమతి అయిన కొబ్బరి



కాయలు సైతం ఐదారు రోజుల కంటే ఎక్కువ నిల్వ ఉండడం లేదు. శ్రావణమాసంలో ఎక్కువగా భక్తులు దేవాలయాలకు వెళ్తుంటారు. దీనికితోడు గ్రామీణ ప్రాంతాల్లో పోచమ్మ, భూదేవి ఉత్సవాలు జరుగుతున్నాయి. దేవుడికి నైవేద్యంగా కొబ్బరికాయలు కొడుతారు. అధిక రేటు ఉన్నప్పటికీ భక్తులు కొబ్బరికాయలు కొనుగోలు చేస్తున్నారు.

● కొబ్బరికాయ ధరలు అమాంతంగా పెరిగాయి..

- ఆడెపు శ్రీనివాస్, స్థానికుడు, హుజూరాబాద్

శ్రావణమాసంలో కొబ్బరికాయ ధరలు అమాంతంగా పెరిగాయి. నెలరోజుల క్రితం రూ.20ఉన్న కొబ్బరికాయ నేడు పట్టణాల్లో రూ.35, గ్రామీణప్రాంతాల్లో రూ.40లకు విక్రయిస్తున్నారు. వచ్చిన కొబ్బరికాయలు నాసిరకంగా, చిన్నవిగా ఉంటున్నాయి. వారం రోజుల్లోనే కుళ్లిపోతున్నాయి.

ఆదివాసీ ప్రాంతాలపై ప్రభుత్వాల ఉక్కుపాదం

జ్యోతినగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపుతూ పాశవిక హననానికి పాల్పడుతున్నారని సీపీఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయకార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి, పెద్దపల్లిడివిజన్ కార్యదర్శి తోకల రమేష్ ఆరోపించారు. శనివారం ఎన్‌టీపీసీలోని యూనియన్ కార్యాలయంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ అనే రాజకీయ సాంస్కృతిక సైనికవ్యూహం నేడు మధ్య భారతంలో కేంద్రప్రభుత్వ కనుసన్నల్లో అప్రతిహతంగా కొనసాగుతూ ఆదివాసీల ప్రాంతాల్లో అల్లకల్లోలం సృష్టిస్తున్నదని పేర్కొన్నారు. పారామిలిటరీ సైన్యాలను, డిఆర్‌జీ తదితర పోలీసు, అటవీ అధికారులను వేలకోట్ల రూపాయాలు కుమ్మరించి ఆదివాసీలపైకి ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వందనీతిని ఎండకడుతూ పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, ఆడేపు శంకర్, గూడూరి వైకుంఠం, రాయమల్లు, నరసయ్య, రాజయ్య, సురేష్, నాని పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కుల నీటి విడుదల


కాకతీయ కాలువకు విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగు కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కుల నీటి విడుదలను శనివారం అధికారులు కొనసాగించారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీగేట్లు ఎత్తివేయడం, విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ తదితర ప్రాజెక్టులు నిండడంతో ఎస్సారెస్పీలోకి 14,630క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 40.583 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువకు 3వేలక్యూసెక్కులు, సరస్వతీకాలువకు 300క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 150క్యూసెక్కులు, వరదకాలువకు 3వేల క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 360క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 462 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 32.807 టీఎంసీల వరద నీరువచ్చి చేరగా, 5.011 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

సాంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) సాంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా వ్యవస్థ ప్రముఖ్ మండె మల్లిఖార్జున్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో శనివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పంచపరివర్తన అంశాలైన పర్యావరణ పరిరక్షణ, కుటుంబ వ్యవస్థ బలోపేతం, సామాజిక సమరస్యత, స్వదేశి ఉత్పత్తుల వినియోగం, పౌర నియమాలు పాటించడంపై అవగాహన కల్పించారు. రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట ఖండ కార్యవాహ తాటిపెల్లి మహేష్, కాసుపాక కిషన్, నాగసముద్రాల బాలకృష్ణ, బొల్లం ధనుంజయ్, కంకటి శ్రీకాంత్‌లతో పాటు స్వయంసేవకులు పాల్గొన్నారు.

దక్షిణ భారత సాహిత్యోత్సవంలో పెద్దింటి, పత్తిపాక


పెద్దింటి అశోక్, పత్తిపాక మోహన్

సిరిసిల్ల ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో బుక్ బ్రహ్మ ఫౌండేషన్ దక్షిణ భారత స్వరాలు పేరుతో ఈనెల8 నుంచి నిర్వహిస్తున్న సాహిత్యోత్సవంలో శనివారం సిరిసిల్లకు చెందిన కథకులు, సినీ రచయిత పెద్దింటి అశోక్, సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్‌లు పలు సదస్సుల్లో వక్తలుగా పాల్గొన్నారు. పెద్దింటి ప్రాంతీయ అస్తిత్వం సదస్సులో తెలంగాణ భాష అస్తిత్వ చేతనలపై మాట్లాడారు, మరో సదస్సులో పెద్దింటి సాహిత్యకారులు-సినీ రచనలు అంశంపై చర్చల పాల్గొన్నారు. బాల సాహిత్యం-రచనా కళా సదస్సులో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ తెలుగు బాల సాహిత్యం, భాష, నాడు-నేడు అంశాలపై చర్చించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

సుల్తానాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక స్వప్న కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్లంకి ప్రభాకర్, వొల్లాల అంజయ్య, నార్ల శ్రీనివాస్, పురుషోత్తంరావు, శ్రావణ్, అల్లాడి భగవాన్, భాగ్యమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బొంత కుంటపల్లి రామాలయంతోపాటు పలు వైష్ణవాలయాల్లో కళ్యాణోత్సవాలు జరిగాయి.

లంబాడిపల్లిలో..

మల్యాల: మండలంలోని లంబాడిపల్లిలో గల పద్మావతీ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రావణ నక్షత్రం పుర్కరించుకొని శ్రీనివాస కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా


సుల్తానాబాద్‌లో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ప్రత్యేక పూజలు జరుపగా అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇకనుంచి ప్రతినెలా శ్రావణనక్షత్రం రోజున కళ్యాణం నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. అర్చకులు వికాస్ శుక్లా, విజయ్ సముద్రాలతో పాటు చైర్మన్ మరాఠి సత్తయ్య పాల్గొన్నారు.

వైభవంగా రుగ్వేద, యజుర్వేద ఉపాకర్మలు

● వేద మంత్రాలతో మార్మోగిన రాజన్న ఆలయ పరిసరాలు


అద్దాల మండపంలో యజ్ఞోపవీతం గావిస్తున్న రుగ్వేద బ్రాహ్మణులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి సందర్భంగా వేములవాడ పట్టణంలోని రుగ్వేద, యజుర్వేద బ్రాహ్మణులు యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని అద్దాల మంటపంలో రుగ్వేద బ్రాహ్మణులు, నాగిరెడ్డి మంటపంలో యజుర్వేద బ్రాహ్మణులు ఆలయ స్థానాచార్యులు నమిలికొండ ఉమేష్ ఆధ్వర్యంలో ఉపాకర్మను ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన అగ్రహారంలోని 128 కుటుంబాలకు చెందిన బ్రాహ్మణులు సంప్రదాయ పద్ధతిలో ఆలయానికి చేరుకుని యజ్ఞోపవీతంలో పాల్గొన్నారు. యజ్ఞోపవీతంలో భాగంగా ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్, అర్చకులు మామిడిపల్లి శరత్ గోపన్నగారి గణేష్, చందుల ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలు వేదమంత్రాలతో మార్మోగాయి. ఈ కార్యక్రమానికి 300కు పైగా బ్రాహ్మణులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రతాపరామకృష్ణ, రవిందర్, ప్రతాప చంద్రమౌళి, మామిడిపల్లి రాజన్న, గర్భకుర్తి వెంకటేశ్వర్లు, పురాణం రాము, చొప్పకట్ల భాను, మల్లికార్జున్, గోపి, కృష్ణచంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో నెలకొన్న భక్తుల రద్దీ

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు స్వామివారి దర్శనానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాజన్నను దర్శించుకుని కోడె మొక్కులు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు చర్యలు చేపట్టారు.


నాగిరెడ్డి మండపంలో యజ్ఞోపవీతంలో పాల్గొన్న యజుర్వేద బ్రాహ్మణులు


రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ధర్మపురి క్షేత్రంలో ఘనంగా నూలు పౌర్ణమి వేడుకలు

ధర్మపురి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక బ్రాహ్మణ సంఘంలో వేదపండితులు కాసర్ల వంశీకృష్ణ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య కలశ గణపతి పూజ, పృథ్విపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, ఉపాకర్మ ఉత్సవం జరిపారు. అనంతరం వేదబ్రాహ్మణులు నూతన యజ్ఞోపవీతాధారణ చేశారు. కార్యక్రమంలో ధర్మపురిపట్టణ బ్రాహ్మణసేవా సంఘం అధ్యక్షుడు ఇందారపు రామయ్య, ప్రధానకార్యదర్శి నందగిరి గిరిధర్, సంగనభట్ల దినేష్, మధ్వాచారి రాంకిషన్, కొరిడె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● ధర్మపురిక్షేత్రంలో శ్రీవైష్ణవులు, పద్మశాలి కులస్థులు యజ్ఞోపవీతాధారణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీవైష్ణవులు తమ ఇళ్లలో, శ్రీ మార్కండేయస్వామి ఆలయంలో పద్మశాలి కులస్థులు యజ్ఞోపవీతాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు కొంక సుధీర్‌పాల్గొన్నారు.

● లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ..

శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరి గింది. లక్ష్మీనరసింహస్వామి అనుబంధ శ్రీఉగ్రనరసింహ, శ్రీవేంకటేశ్వర, శ్రీరామలింగేశ్వర స్వామి, గణపతి ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

● మంత్రి అడ్లూరి పూజలు..

లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం సందర్శించారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు ఆలయం వద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ధర్మపురిలో పద్మశాలి సేవా సంఘంలో యజ్ఞోపవీత ధారణ


లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు


ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

శ్రమదానంతో రోడ్డు మరమ్మతు



రోడ్డును బాగు చేస్తున్న గ్రామస్థులు

ఇల్లంతకుంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వల్లంపట్ల గ్రామానికి వచ్చే రోడ్డుపూర్తిగా చెడిపోవడంతో గ్రామస్తులు ఏకమై శ్రమదానం ద్వారా రోడ్డుపై గుంతలు పూడ్చారు. వల్లంపట్ల గ్రామానికి వచ్చే ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయవెంకటనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జేసీబీ, బ్లేడ్‌బండి, ట్రాక్టర్ యజమానులు ముందుకు వచ్చి రోడ్డును బాగుచేశారు. శ్రమదానం చేసిన వారిని గ్రామస్థులు అభినందించారు. శ్రమదానంలో కుర్ర రమేష్, పండుగ భాస్కర్, కడుదుల రాజయ్య, భాషా, గుర్రం భూమిరెడ్డి, ఒగ్గు రామకృష్ణ, కట్ట శ్రీకాంత్‌రెడ్డి, కర్ల వేణు, కుర్ర రఘు, ముద్దాల అభిషేక్, నాయిని ప్రదీప్, మారుపాక వంశీ, లకపాక నర్సయ్యలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాగుల సత్యనారాయణ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : క్విట్ ఇండియా స్ఫూర్తితో భారతీయులంతా సమైక్యంగా ముందుకు సాగాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆగస్టు మాసం ప్రారంభించుకున్న సందర్భంగా శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండాను గ్రంథాలయం సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమంతో స్వాతంత్ర్యం సాధించుకున్నామని అన్నారు. మహాత్మాగాంధీ పిలుపుతో నాడు క్విట్ ఇండియా ఉద్యమాన్ని చేపట్టి బ్రిటీష్ పాలకులను తరిమికొట్టారన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దేశంపై 50 శాతం టారీఫ్‌లను విధిస్తూ అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో భారతీయులంతగా ఐక్యంగా ట్రంప్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యాక్షుడు బొప్ప దేవయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, మాజీ పీసీసీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మార్కెట్ కమిటి డైరెక్టర్ దుబాల వెంకటేశం, ఎండీ ఖాజా, కాసర్ల రాజు, మాజీ జడ్పీటీసీ నాగంకుమార్, నాయకులు గుజ్జె రమేష్, చిటికెన సత్తయ్య, తాటికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న ప్రశాంత్

తంగళ్లపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర నాయకులతో కలిసి యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో యువత రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జలగం ప్రవీణ్(టోని), ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింహాం గౌడ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, వివిధ గ్రామశాఖ అధ్యక్షులు ప్రకాష్ గౌడ్, భైరి వేణు, కుమార్, ప్రశాంత్, చందు, సీనియర్ నాయకులు మందాటి తిరుపతి, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా మార్కండేయ స్వామి శోభాయాత్ర

- మగ్గంతో ప్రదర్శన.. - శోభాయాత్రకు తరలి వచ్చిన పద్మశాలీలు - వస్త్ర పరిశ్రమ కొత్తపుంతల తొక్కాలి - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో మార్కండేయ స్వామి శోభాయాత్ర



శోభాయాత్రలో మగ్గం ప్రదర్శన



శోభాయాత్రలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పద్మశాలి సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : శివభక్త మార్కండేయ స్వామి నామస్మరణ... శివహోం... అంటూ తరలివచ్చిన పద్మశాలీల జనసందోహం మధ్య కన్నుల పండువగా మార్కండేయ స్వామి శోభాయాత్ర శోభిల్లింది. ఎటు చూసినా శోభయమానం స్వామివారి యాత్ర కన్నుల పండువగా సాగింది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మార్కండేయ స్వామి దేవాలయం నుంచి బయలుదేరిన మార్కండేయ స్వామి రథయాత్ర... మగ్గం ప్రదర్శనతో సాగిపోయింది. శోభాయాత్రకు వందలాది మంది పద్మశాలీలు తరలివచ్చారు. శనివారం సిరిసిల్ల పద్మశాలీ సంఘం, యువజన, మహిళ సంఘం ఆధ్వర్యంలో నూలు పౌర్ణమి సందర్భంగా మార్కండేయ దేవస్థానం నుంచి ప్రత్యేక అలంకరణలతో మార్కండేయ స్వామి రథం ముందు సాగిపోతుండగా వెనకాలే ట్రాక్టర్‌పైనా మగ్గంపై కార్మికుడు కండువా నేస్తూ ప్రదర్శన నిర్వహించారు. సిరిసిల్ల పట్టణ ప్రజలందరు శోభాయాత్రకు తరలి వచ్చారు. గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా చేనేత చౌక్ మీదుగా శోభాయత్ర సాగింది. గాంధీ, అంబేద్కర్, నేతన్న విగ్రహాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి పద్మశాలి ప్రతినిధులు మగ్గంపైన నేసిన కండువతో పాటు పూలమాలలు వేశారు. పద్మశాలి మహిళ ప్రతినిదులు ఆది శ్రీనివాస్‌కు రాఖీ కట్టారు. ఉదయమే మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి యజ్ఞోపవీత ధారణతోపాటు గణపతిపూజ, నవగ్రహ ఆరాధన, గాయత్రీ హోమం, నిర్వహించారు. శోభాయాత్రలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, టెక్స్‌టైల్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ గుడూరి ప్రవీణ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ చైర్మన్లు జిందం కళచక్రపాణి, అడెపు రవీందర్, పద్మశాలీ సంఘం ప్రతినిధులు మండల సత్యం, తాటిపాముల దామోదర్, దూడం శంకర్, గోవిందు రవి, ఆడెపు భాస్కర్, బొల్లి రామ్మోహన్,సంగీతం శ్రీనివాస్,డాక్టర్ గాజుల బాలయ్య, యెల్లె లక్ష్మీనారాయణ, గుండ్లపల్లి పూర్ణచందర్, మోర రవి, గెంట్యాల శ్రీనివాస్, మ్యాన రవి, వెంగళ శ్రీనివాస్, కట్టెకోల లక్ష్మీనారాయణ, అంకాలపు రవి, గుంటుక మహేష్, మధు, కామిని వనిత, గుజ్జె తార, అడెపు చంద్రకళ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



చేనేత విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆది శ్రీనివాస్, పద్మశాలి సంఘం ప్రతినిధులు

వస్త్ర పరిశ్రమ కొత్తపుంతలు తొక్కాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కొత్తపుంతలు తొక్కాలని, నేతన్నలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శోభాయత్రలో మాట్లాడుతూ ప్రభుత్వం నేత కుటుంబాలను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టిందన్నారు. నేతన్నలను మార్కండేయ స్వామి చల్లగా చూడాలని కోరుకున్నారు.

ప్రజలను విస్మరించిన ఎమ్మెల్యే కేటీఆర్

- ఎమ్మెల్యేగా గెలిచి 20 నెలలు గడుస్తున్నా సమస్యలను పట్టించుకోవడం లేదు - బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడంతోపాటు ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటారని ప్రజలు ఓట్లు వేసి సిరిసిల్ల ఎమ్మెల్యేగా కేటీఆర్‌ను మరోసారి గెలిపిస్తే 20నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపి మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు సిరిసిల్ల నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి అభివృద్ధి పనులను ఆయన సామాజిక వర్గానికి అందించారని ఆరోపించారు. 20 నెలల క్రితం జరిగిన ఎన్నికలల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇప్పటివరకు ఎన్ని రోజులు ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి సిరిసిల్లలో ఉన్నారనే విరాలను బహిరంగంగా ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం ప్రజల సమస్యలను స్థానిక ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండి పరిష్కరించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కాంపు కార్యాలయాన్ని సిరిసిల్లలో కోట్లు రూపాయలు ఖర్చుచేసి నిర్మించిందని, అందులో కేటీఆర్ ఎప్పుడు నిద్ర చేసి ప్రజల సమస్యలను పరిష్కరించారో తెలిపాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో ప్రతి శని, ఆదివారాలు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ ముందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరైతే దానిపై కేంద్ర హోం శాఖ మంత్రికి ఇంటలిజెన్స్ పనితనం తెలియదని కేటీఆర్ మాట్లాడడం సరైంది కాదన్నారు. వాస్తవంగా కేటీఆర్ చేతిలో ఇంటలిజెన్స్‌ను పెట్టుకుని సినిమా హీరోయిన్‌లు, హీరోలు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తల ఫోన్‌లను ట్యాపింగ్ చేయించి వారి నుంచి లక్షలతో పాటు కోట్ల రూపాయలను తీసుకున్నాడని ఆరోపించారు. ఇంటలిజెన్స్ చేతిలో పెట్టుకుని వాళ్లు చేసిన మోసాలను ప్రభాకర్‌రావు సిట్ విచారణలో చెబుతున్నాడనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిపై నోరుజారీ సహించేది లేదన్నారు. ఇప్పటికైనా సిరిసిల్లలో వారానికి ఒక రోజు ప్రజలకు అందుబాటులో ప్రజ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, పొన్నాల తిరుపతిరెడ్డి, అసాని లింగారెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాల్యాన్ని 'నులి'పేస్తుంది..

(5వ పేజీ తరువాయి)

మాత్రలను వయస్సును బట్టి వేసుకోవాల్సి ఉంటుంది. ఒకటి, రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను, 2-3 సంవత్సరాలలోపు పిల్లలకు ఒక మాత్రను పొడిచేసి నీళ్లలో కలిపి తాగించాలి. ఆపైబడిన వారికి 400 ఎంజీ అల్బెండజోల్ మాత్రను చప్పరించి లేదా నమిలి వేయించాలి.

పొట్టలో దర్జాగా పురుగులు..

అపరిశుభ్రతతో అనేక పురుగులు పిల్లల పొట్టలోకి చేరిపోతాయి. పిల్లలు తినే ఆహారం లోపల దర్జాగా తింటూ ఉంటాయి. ఈ పురుగులు పొట్టలోకి ఎలా వస్తాయంటే అపరిశుభ్రతతో నులిపురుగులు, ఇతర పురుగులు మన పొట్టల్లో వృద్ధి చెందుతాయి. పిల్లలు మట్టిలో ఆడుకొని వచ్చి అదే చేతితో తినుబండారం తినడం జరుగుతుంది. పిల్లలే కాదు పెద్దవాళ్లు కూడా కనిపిస్తుంటారు. మహిళలు బియ్యం ఏరుతూ మట్టిగడ్డలు తినే అలవాటు కూడా ఉంటుంది. చేలల్లో గరకలు, మట్టిని కూడా చప్పరిస్తుంటారు. దీంతో మట్టిలో పురుగుల గుడ్లు పొట్టలోకి వెళ్లిపోతుంటాయి. అంతేకాకుండా మలం మీద వాలిన ఈగలు తిరిగి ఆహారపదార్థాల మీద వాలడం వల్ల పురుగుల గుడ్లు ఆహారం మీద ఉండిపోతాయి. తాగునీటి పైపులైన్లలో డ్రైనేజీ నీళ్ల కలవడం వల్ల కూడా ఈ గుడ్లు పొట్టలోకి చేరుతాయి. పెరిగిన గోళ్ల వాటిలో ఇరుక్కుపోయిన మట్టి వల్ల కూడా గుడ్లు పొట్టలోకి వెళ్లి వివిధ రకాల పురుగులు తయారవుతాయి.

అపోహలు వద్దు.. మాత్రలు వేసుకోవాలి..

- డాక్టర్ రజిత, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి



నులి పురుగుల నివారణ కోసం పంపిణీ చేసే ఆల్బెండజోల్ మాత్రలు సంవత్సరం నుంచి 19 సంవత్సరాలలోపు వారందరూ తప్పనిసరిగా వేసుకోవాలి. మాత్రలపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు. ప్రధానంగా రక్తహీనత, పిల్లల ఎదుగుదలపై నులి పురుగుల ప్రభావం చూపుతాయి. ఈనెల 11న జిల్లా వ్యాప్తంగా మాత్రలు పంపిణీ చేస్తాం. ఆరోజు మాత్రలు తీసుకోని వారికి 18వ తేదిన మాత్రలు అందిస్తాం. జిల్లాలో 1.18 లక్షల మందికి మాత్రలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

పంచాయతీ భవన నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- కొత్త భవనం నిర్మాణం చేపట్టారు.. వదిలేశారు.. - పాత భవనంలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న సిబ్బంది

కోనరావుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కొత్త గ్రామపంచాయతీ భవనం నిర్మాణం చేపట్టి వదిలేశారు. పాత భవనంలోకి పోరాకుండా చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది విధులు నిర్వహించడం ఇబ్బందికరంగా మారింది. ఇదంతా కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి ఉపాధి హామీ నిధుల ద్వారా 20 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆ నిధులతో పాత గ్రామపంచాయతీ ఎదుట నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం రెండు సంవత్సరాల క్రితం గుంతలు తీసి వదిలేశారు. గుంతలు తీసి వదిలేయడం వల్ల గతంలో ఉన్న గ్రామపంచాయతీ భవనంలోకి వెళ్లడానికి ఇబ్బందికరంగా మారింది. అంతేకాకుండా పిల్లలు ఆడుతూ పాడుతూ పిల్లర్ గుంతల్లో పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆగిపోయిన గ్రామపంచాయతీ భవన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



శివంగాలపల్లిలో నూతన గ్రామపంచాయతీ కోసం తీసిన పిల్లర్ గుంతలు

అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు

భగత్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాండ్ నుంచి ఈనెల 14న అరుణాచల పుణ్యక్షేత్రానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడిపిస్తున్నట్లు కరీంనగర్-1 డిపో మేనేజర్ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. 14న గురువారం కరీంనగర్ బస్‌స్టాండ్ నుంచి సాయంత్రం 4 గంటలకు బయలుదేరి 15న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అదే రోజు రాత్రి అరుణాచలానికి చేరుకుంటుందన్నారు గిరి ప్రదక్షిణం దర్శనం అనంతరం అరుణాచలం నుంచి 16న శనివారం మధ్యాహ్నం బయలుదేరి మరుసటి రోజు జోగులాంబ దర్శనం తర్వాత 17న సాయంత్రం కరీంనగర్ చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో పెద్దలకు 4,700, పిల్లలకు 3,540 చార్జీలు ఉంటాయన్నారు. వివరాలకు 9959225920, 8074690491, 7382849352 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్లను మరమ్మతు చేయాలి..

వార్డు ప్రజలతో కలిసి సీపీఎం నాయకుల నిరసన



వార్డుప్రజలతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కార్మిక క్షేత్రంలో రోడ్లను మున్సిపల్ అధికారులు మరమ్మతు చేసిన ప్రజల అవస్థలను తీర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని 21 వవార్డు గణేష్ నగర్‌లో శనివారం వర్షానికి దెబ్బతిన్న రోడ్లతోపాటు రోడ్డుకు అడ్డంగా పోసిన మట్టికుప్పల వద్ద వార్డు ప్రజలతో కలిసి సీపీఎం నాయకులు నిరసనలు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గణేష్‌నగర్‌లో రోడ్లతో పాటు మురికి కాలువలు లేకపోవడంతో మురుగు నీరు, వర్షం నీరు రోడ్లపై నిలిచి నడిచేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. గత 20 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో కౌన్సిలర్‌లుగా గెలిచిన వాళ్లు ఆ రోడ్లు, మురికికాలువలను పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలోనే అతి పెద్ద వార్డుగా ఉన్న గణేష్ నగర్ ప్రసుత్తం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందన్నారు. మున్సిపాలిటీకి సైతం గణేష్ నగర్ నుంచే ఆదాయం వస్తున్నా అధికారులు ఆ వార్డును పట్టించుకోవడం లేదన్నారు.

ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్‌తో పాటు అధికారులు స్పందించి గణేష్‌నగర్‌లో పర్యటించి సిమెంట్ రోడ్లు, మురికి కాలువలను నిర్మించాలని లేకుంటే వార్డు ప్రజలతో సీపీఎం అధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల రాజు, ఉమాపతి, సాప చందు, నవీన్, నాగరాజు, సంపత్, కనుక రాజేశం తదితరులు పాల్గొన్నారు.

బీసీల బహిరంగ సభను విజయవంతం చేయాలి

భగత్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్‌తో ఈనెల 14న కరీంనగర్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని శాసన మండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి కోరారు. చింతకుంటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బహిరంగ సభకు ఐదు నియోజకవర్గాల నుంచి అత్యధికసంఖ్యలో బీసీలు హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు పాల్గొన్నారు.

చివరి మజిలీకి తప్పని కష్టాలు



వినియోగంలోకి రాని బర్నింగ్ ప్లాంట్



నీటి సౌకర్యం లేని గదులు

కోనరావుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చివరి మజిలీకి కష్టాలు ఎదురవుతున్నాయని ప్రభుత్వం ప్రతి గ్రామంలో వైకుంఠ ధామాలను నిర్మించి, దహన సంస్కారాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైకుంఠధామాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మించిన వైకుంఠధామాల్లో సమస్యలు ఉండడం వల్ల చివరి మజిలీకి కష్టాలు తప్పడం లేదు. కోనరావుపేట మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామపంచాయతీకి వైకుంఠధామం నిర్మాణానికి 13 లక్షల రూపాయలను మంజూరు చేసింది. కానీ కొన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు పూర్తయినప్పటికీ సమస్యలు ఉన్నాయి. మరికొన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదు. పూర్తయిన వైకుంఠధామాల్లో లైట్లు నీటి వసతులు ఏర్పాటు చేయలేదు. దీనివల్ల దహన సంస్కారాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో వైకుంఠధామాల్లో సమస్యలు ఉండడం వల్ల ప్రజలు వారి పంట పొలాల్లోనే దహన సంస్కారాలు చేసుకుంటున్నారు. కొంతమంది చేతి లైట్ల ద్వారా వైకుంఠధామాల్లోకి వెళ్లి దహన సంస్కారాలు తప్పని పరిస్థితుల్లో చేసుకుంటున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామాల్లో అన్ని ఏర్పాట్లు చేసి చివరి మజిలీకి కష్టాలు లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.